సాక్షి
సూర్యాపేట
గురువారం । 17 । అక్టోబర్ । 2024



రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి

ఎస్ఎల్‌బీసీని రెండేళ్లలో పూర్తి చేస్తామని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,08,782 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 64,800 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,907 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6,253 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.10 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,036 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,407 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 169 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 242 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

అనర్హులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు.. ముగ్గురి సస్పెన్షన్

భానుపురి (సూర్యాపేట) : కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు 11 మంది అనర్హులైన లబ్ధిదారులకు అందించిన ఘటనలో ఇద్దరు పంచాయతీ సెక్రటరీలు, ఓ గిర్దావర్‌పై కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సస్పెన్షన్ వేటు వేశారు. జిల్లాలోని నూతనకల్ మండలం మాచినపల్లి గ్రామంలో అనర్హులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించారన్న ఫిర్యాదు మేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవరావు, నూతనకల్ తహసీల్దార్ విచారణ జరిపి 11 మంది లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించారు. లబ్ధిదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తప్పుడు మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇచ్చిన దిర్శనపల్లి పంచాయతీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, మిర్యాల పంచాయతీ సెక్రటరీ అనిల్ లను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపకుండా లబ్ధిదారులకు చెక్కులు అందజేసినందుకు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నూతనకల్ గిర్దావర్ లక్ష్మీ ప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేశారు.

నేడు తిరుమలగిరి మార్కెట్‌కు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మార్కెట్‌కు అధికంగా ధాన్యం రావడం .. కాంటాలు ఆలస్యమవుతుండడం.. ఎగుమతులు కాకపోవడం తదితర కారణాలతో పాటు తుపాన్ హెచ్చరికలనేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

29 వరకు విద్యానిధి దరఖాస్తు గడువు పొడిగింపు

భానుపురి (సూర్యాపేట) : 2024 -25 విద్యా సంవత్సరానికి అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పథకం కింద ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువుల కోసం ఉపకార వేతన దరఖాస్తు గడువును ఈనెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకొని https-://telanganae pass.gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మత్స్య సంపదను పెంచాలి



మాధవరంలోని ఊరచెరువులో చేపపిల్లలు పోస్తున్న అధికారులు, నాయకులు

మునగాల: ప్రతి గ్రామంలో మత్స్య సంపదను పెంచేందుకు మత్స్య సహకార సంఘాలు కృషి చేయాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నాగుల్ నాయక్ కోరారు. బుధవారం మునగాల మండలం మాధవరం ఊరచెరువులో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ భైరవైన శ్రీను, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అక్షిత, మాధవరం మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ నాగయ్య పాల్గొన్నారు.

పేద ప్రజల గొంతుక.. ప్రజానాట్యమండలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : ప్రజానాట్యమండలి పేద ప్రజల గొంతుకగా నిలిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్ నగర్ లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం,మతం పేరుతో సమాజాన్ని చీలుస్తున్న మతోన్మాదుల నిజరూపాన్ని ప్రజలకు వివరించేందుకు ప్రజానాట్యమండలి ప్రచారం చేస్తోందన్నారు. మతం వేరు, రాజకీయం వేరు అని ప్రజలకు తెలియ పరచి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రజానాట్యం మండలి కళాకారులపై ఉందని గుర్తు చేశారు. సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, నాయకులు ధనుంజయ నాయుడు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, గోపన బోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోస్టింగ్ ఆర్డర్లు చూపుతున్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలతో డీఈఓ అశోక్

స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలకు పోస్టింగ్

సూర్యాపేటటౌన్ : స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలకు బుధవారం పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. వీరు గురువారం స్కూళ్లలో జాయింగ్ కాను న్నారు. డీఎస్సీ 2024లో ప్రతిభ కనబర్చిన స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల ఫలితాలను సర్టిఫికెట్‌ల పరిశీలన తర్వాత వివిధకారణాలతో నిలిపివేశారు. 11 ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్, 30 మంది ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఉన్నారు. బుధవారం 30 మంది స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలకు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు.

కుల గణనకు సన్నాహాలు

- 60 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- ఎన్యుమరేటర్ల నియామకానికి జిల్లా యంత్రాంగం కసరత్తు
- శాఖల వారీగా సిబ్బంది వివరాల సేకరణ
- పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాగానే ప్రక్రియ ప్రారంభం



భానుపురి (సూర్యాపేట) : సమగ్ర సామాజికవర్గ (కుల) గణనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈనేపథ్యంలో ఇంటింటి సర్వే చేపట్టడానికి ఎంత మంది సిబ్బంది అవసరమో శాఖల వారీగా జిల్లా అధికారులు లెక్కలు వేస్తున్నారు.

అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కుల గణనకు హామీ ఇచ్చింది. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. ప్రధానంగా బీసీ గణన చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంతో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. కుల గణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగ పడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచ్, స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

బీసీల లెక్కింపు ఊసే లేదు

ప్రతి పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన చేపట్టలేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా గుర్తించారు. కానీ, బీసీల గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయస్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సిబ్బంది నియామకానికి కసరత్తు

ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బంది (ఎన్యుమరేటర్లు) ఎంత మంది అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

పత్తి కొనుగోలుకు ఆరు కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లు కేంద్రాల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెల్లడించారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు, కొలతలు, పోలీస్, రవాణా, జిన్నింగ్ మిల్లుల యజమాలతో పాటు సంబంధిత శాఖ అధికారులతో బుధవారం సూర్యాపేట కలెక్టర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పత్తి క్వింటాకు సీసీఐ కనీస మద్దతు ధర రూ.7,521లుగా నిర్ణయించిందన్నారు. జిల్లాలో 78 వేల ఎకరాల్లో పత్తి సేకరణకు అవకాశం ఉందన్నారు. దీనికోసం సూర్యాపేటకు సమీపంలోని బాలెంల మంజిత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుమలగిరిలో సిద్ధి ఫైబర్, సంతోషిమాత కాటన్ ఇండస్ట్రీస్, శ్రీనివాస జిన్నింగ్ మిల్, చింతలపాలెంలో డాక్టర్ అండ్ ఫ్రెండ్స్ కాటన్ జిన్నింగ్ మిల్, భారతమ్మ కాటన్ మిల్లు వద్ద అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. కనీస మద్దతు ధరపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చివరి కేజీ వరకు పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. పత్తి కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా టోల్ ఫ్రీ నంబర్ 6281492368 కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, సూర్యాపేట మార్కెటింగ్ అధికారి ఆర్. సంతోష్ కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జానయ్య, విద్యుత్ శాఖ అధికారి ఉదయ భాస్కర్, డీపీసీ జనరల్ మేనేజర్ జె. సీతారాం, ఆర్డీఓ జి. సురేష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి, మార్కెటింగ్ అధికారులు కె. శ్రీధర్, డి. శ్రీనివాస రావు, వెంకట్ రెడ్డి, జిన్నింగ్ మిల్లు యజమానులు రామన్, లక్ష్మీనారాయణ, ఉదయ్ కుమార్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీరవోలు

తిరుమలగిరి, అర్వపల్లి : డీసీసీబీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బీరవోలు సోమిరెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సోమిరెడ్డికి వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సోమిరెడ్డి 1980లో యూత్‌కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా, 1992నుంచి 1995వరకు నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. 2004నుంచి 2009 వరకు టీఆర్ఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, 2010 నుంచి2014 వరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, బీరవోలు విక్రంరెడ్డి, తిమ్మాపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో బీరవోలు సోమిరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సామేల్

భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇస్తాం

- ఆర్డీఓ శ్రీనివాసులు

పాలకవీడు: పాలకవీడు మండల పరిధిలోని గుండెబోయినగూడెం, జాన్‌పహాడ్ రెవెన్యూ గ్రామాల మధ్య కృష్ణానదిపై రూ.250కోట్లతో చేపట్టిన లిఫ్టుకు సంబంధించి పైప్‌లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు చెప్పారు. లిఫ్టు నిర్మాణ పనులు సాగుతుండగా ఇటీవల పైప్‌లైన్ నిర్మాణానికి భూసేకరణ సర్వే పూర్తయిందని తెలిపారు. పైప్‌లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో బుధవారం పాలకవీడు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం, 20మీటర్ల వెడల్పు, సుమారు ఐదు మీటర్ల లోతుతో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీని కోసం మండల పరిధిలోని జాన్‌పహాడ్, గుండెబోయినగూడెం, గుండ్లపహాడ్, బొత్తలపాలెం, కోమటికుంట గ్రామాల్లో 37.20 ఎకరాల భూమి సేకరిస్తున్నట్లు వివరించారు. సంబంధిత రైతులకు భూమి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఒకటిన్నర నుంచి మూడు రెట్ల వరకు పరిహారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా భూముల్లో బోర్లు, పైప్‌లైన్లు, చెట్లకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందజేస్తామన్నారు. భూమి పట్టా ఒకరి పేరుమీద, అనుభవంపై మరొక రైతు ఉంటే అనుభవ దారుడికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో శుక్రవారం రైతుల సమక్షంలో రీ సర్వే చేపడతామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కమలాకర్, భూ సేకరణ అదనపు తహసీల్దార్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సైదా, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మాజీ జెడ్పీటీసీ బుజ్జి మోతీలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం. ఆ తరువాత ఆలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఇక ఆలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

21నుంచి 31వరకు పోలీస్ ఫ్లాగ్ డే

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : పోలీస్ అమరులను స్మరిస్తూ ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించనున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత, విద్యార్థులు ఇందులో భాగమై పోలీస్ అమరులకు నివాళులర్పించాలని కోరారు. పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు పోలీస్ విధులు, టెక్నాలజీ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం సేకరిస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను సందర్శించడమే కాకుండా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. పోలీస్ అమరులను స్మరిస్తూ జిల్లా వ్యాప్తంగా క్యాండిల్ ర్యాలీ, సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తక్కువ నిడివి గల షార్ట్ ఫిల్మ్, రీసెంట్ ఫొటోలు, ఆర్టికల్స్‌పై పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ ప్రజా సంబంధాల అధికారికి ఈ నెల 27వ తేదీలోగా అందించాలని ఆయన కోరారు. వివరాలకు సెల్‌నంబర్ 7013923377 ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.



సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ

ప్రతిభను వెలికితీసేందుకు కళా ఉత్సవ్ దోహదం

సూర్యాపేటటౌన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కళా ఉత్సవ్‌లాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ డీఎస్ జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిభా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆరు అంశాలపై పోటీలు నిర్వహించగా 30 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబర్చారన్నారు. గురువారం కూడా ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని నవంబర్ 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, న్యాయనిర్ణేతలు నాగరాణి, శ్రీదేవి , రేణుక, శైలజ, విజయలక్ష్మి, సత్యనారాయణ సింగ్, వీరు నాయుడు, యల్లయ్య, రాజు, అనిల్, సాయి చరణ్, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

కొలువుదీరిన కొత్త టీచర్లు

- కేటాయించిన స్కూళ్లలో చేరిన ఉపాధ్యాయులు
- తొలిరోజు నుంచే పాఠాల బోధన
- ఘన స్వాగతం పలికిన విద్యార్థులు
- ఆనందంలో మునిగితేలిన టీచర్లు



సూర్యాపేటలోని ఎంఈఓ కార్యాలయానికి జాయినింగ్ కాపీలతో వచ్చిన నూతన ఉపాధ్యాయులు, చిత్రంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేటటౌన్ : ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. డీఎస్సీ కోసం కష్టపడి చదివి టీచర్లుగా ఉద్యోగాలు సాధించిన వారు బుధవారం బడిబాట పట్టారు. వీరికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విధుల్లో చేరి తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి కొత్త అనుభూతి పొందారు. డీఎస్సీ 2024 ఫలితాల్లో మెరిట్ సాధించి కొలువు పొందిన 322 మంది అభ్యర్థులు ఈ నెల 9వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో మంగళవారం 1:1 ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి ర్యాంకుల ఆధారంగా కొత్త ఉపాధ్యాయులకు స్కూళ్లను కేటాయించారు. మొదట మండల విద్యాశాఖ అధికారి వద్దకు వెళ్లి అక్కడ ఆర్డర్ కాపీ అందజేసి ఆ తర్వాత స్కూల్‌కు వెళ్లి జాయిన్ అయి తరగతి గదికి వెళ్లారు.

తొలి రోజు పది మందికి పైగా..

తొలిరోజు తరగతి గదికి వెళ్లాక కొత్త అనుభూతి కలిగిందని పలువురు కొత్త ఉపాధ్యాయులు చెప్పారు. పాఠాలు బోధించడం, విద్యార్థులతో మాట్లాడటం చాలా ఆనందం అనిపించిందని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 322 మంది నూతన ఉపాధ్యాయులను ఖాళీల వారీగా ఆయా స్కూళ్లకు కేటాయించారు. అయితే పది మందికి పైగా ఇతర శాఖల్లో ఉద్యోగాలు చేసే వారు రిలీవ్ అయ్యేందుకు వెళ్లడంతో మొదటి రోజు వారు పాఠశాలలకు రాలేకపోయారని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



సూర్యాపేటలో ఎంపీఎం హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న నూతన ఉపాధ్యాయురాలు ఫర్హానా

ఎంతో ఆనందంగా ఉంది



ఇంత కాలం నేను ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేశాను. ఎంతో కష్టపడి చదివా. ఎలాగైనా గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం సాధించాలనే తపనతో చదివాను. మా నాన్న, నా భర్త ప్రోత్సాహంతో టీచర్‌గా ఎంపికయ్యాను. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలో బోధించడం ఆనందమనిపించింది.

– షేక్ ఫర్హానా, స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఎంపీఎం హై స్కూల్, సూర్యాపేట

కొత్త అనుభూతినిచ్చింది



మా ఇంటి ముందు ప్రభుత్వ పాఠశాల ఉండేది. ప్రభుత్వ టీచర్ కావాలి బిడ్డాఅని మానాన్న ఎప్పుడూ చెబుతుండేవాడు. చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే లక్ష్యంతో చదివి ఉద్యోగం సాధించాను. మొదటి రోజు పాఠశాలకు రావడం కొత్త అనుభూతినిచ్చింది. విద్యార్థులకు పాఠాలు బోధించడంతో మంచి ఫీలింగ్ కలిగింది.

– ఎ.రమ్య, ఎస్‌జీటీ, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, సూర్యాపేట

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో మసూక్రిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు మెరుగు నరేష్(19) భువనగిరిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నరేష్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి బలవన్మరణం


కృష్ణయ్య (ఫైల్)

తుంగతుర్తి: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తుంగతుర్తి మండలం తూర్పుగూడెంలో బుధవారం జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగూడెం గ్రామానికి చెందిన తాడూరి కృష్ణయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందని గ్రామ పెద్దలు చిట్యాల రాఘవరెడ్డి, తొట్ల శ్రీనివాస్, చల్లగుల్ల వెంకన్న, రాములమ్మ, అవిలయ్య కలిసి ఆమెతో కేసు పెట్టించి తనను వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన కృష్ణయ్య మంగళవారం ఉదయం తన జేబులో సూసైడ్ నోట్ పెట్టుకొని తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అనిత ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


శ్రవణ్‌కుమార్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని పహాడీనగర్‌కు చెందిన బల్లి శ్రవణ్‌కుమార్(44) అక్టోబర్ 2వ తేదీ నుంచి కనిపించడంలేదని అతడి తండ్రి వెంకటయ్య బుధవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

బోరు మోటార్ల వైర్లు చోరీ

కనగల్: కనగల్ గ్రామంలోని వాగు వెంబడి రైతులకు చెందిన 30 బోరు మోటార్ల వైర్లను గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. దుండగులు చోరీ చేసిన కేబుల్ తీగలను అక్కడే కాల్చి అందులో గల కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. బుధవారం కనగల్ గ్రామానికి చెందిన ఎస్. శంకరయ్య, బైరగోని అశోక్‌గౌడ్, ఎస్. మహేష్, పి. సైదులు, ఎం. శంకరయ్య కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పట్టణానికి చెందిన ఎండీ నదీమ్ గంజాయి సేవిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి సేవించినా, అమ్మినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ కుమారస్వామి హెచ్చరించారు.

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం


నిడమనూరులో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, మాజీ మంత్రి జానారెడ్డి


హాలియాలో ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు

- రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారానికి హాజరు

హాలియా: ఎస్ఎల్‌బీసీ సొరంగం మార్గం పనులను రెండేళ్లలో పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులతో పాటు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. న్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రైతులు ఆయిల్‌ఫామ్ తోటలను పెద్దఎత్తున సాగు చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు అవే వస్తాయన్నారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు మంచి సేవలందించి గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్ నుంచి ర్యాలీగా సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఊరేగింపుగా సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి హాలియా మార్కెట్ చైర్మన్‌గా తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కలసాని చంద్రశేఖర్‌తో పాటు డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ డెలిగేట్ సభ్యుడు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, హాలియా, నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్లు యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

దీపావళికి ముందే రూ.2లక్షల రుణమాఫీ

త్రిపురారం: రాష్ట్రాన్ని సక్రమంగా పరిపాలించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నిడమనూరు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఆయన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రోడ్లు, నీటి పారుదలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ ప్రతి వాగ్ధానాన్ని అమలు చేస్తామన్నారు. దీపావళి పండుగకు కంటే ముందే రైతులకు రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న రైతులకు త్వరలో ఒక తేదీని ప్రకటించి రుణమాఫీ అవకాశం కల్పిస్తామన్నారు. రైతు భరోసా పథకం ఆలస్యమైనా.. అనుకున్న సమయానికి తగిన నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఆయిల్‌ఫాం సాగుకు ఎకరాకు రూ.50 వేలు సబ్సిడీ అందిస్తామన్నారు.

నల్లగొండ జిల్లాను కేసీఆర్ మోసం చేశారు

నల్లగొండ జిల్లాను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేయడంతో రూ.6వేల కోట్లు వడ్డీకే పోతున్నాయన్నారు. తాను జిల్లా మంత్రిగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ.. కార్యకర్తల కోరిక మేరకు అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో అవసరైన రోడ్లను గుర్తించి నిధులు విడుదల చేశామన్నారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. సాగర్ ప్రాంతం అభివృద్ధికి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి కలిసికట్టుగా కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రంగాశాయిరెడ్డి, కర్నాటి లింగారెడ్డి, గోపగాని మాధవి, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ధనావత్ భాస్కర్‌నాయక్, గోపగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెయ్యి నాణ్యత బాగుందని నివేదిక వచ్చింది

- యాదాద్రి ఆలయ ఈవో భాస్కర్‌రావు వెల్లడి



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యత బాగుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదాద్రి కొండపై తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విషయాలను వివరించారు. యాదాద్రీశుడి ప్రసాదంలో వినియోగించే నెయ్యిని పరిశీలించేందుకు ఇటీవల శాంపిల్స్ తీసుకెళ్లారని, వాటిని పరిశీలించిన తరువాత నాణ్యత బాగుందని అధికారులు వెల్లడించారని ఆయన పేర్కొన్నారు. లడ్డూ తయారీతో పాటు ఇతర ప్రసాదాలకు ప్రతి రోజు వెయ్యి కిలోల నెయ్యిని వాడుతున్నామన్నారు. సంవత్సరానికి రూ.15 కోట్ల విలువైన నెయ్యిని మదర్ డెయిరీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మదర్ డెయిరీ నుంచి 40 సంవత్సరాలుగా నెయ్యిని టెండర్ ధరల ప్రకారమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నెయ్యి శాంపిల్స్‌ను ప్రతి నెల పరీక్షలకు పంపుతామన్నారు. మదర్ డెయిరీ ద్వారా నెయ్యి కొనుగోలు టెండర్ వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు గడువు ఉందని, కానీ, ప్రభుత్వం విజయ డెయిరీ నుంచి నెయ్యిని వాడాలని ఆదేశించిందని చెప్పారు. విజయ డెయిరీ నెయ్యిని వాడాలా.. మదర్ డెయిరీ నెయ్యి వాడాలా అనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

బంగారు తాపడం పనులకు శ్రీకారం..

తెలంగాణలో ఏ ఆలయానికీ బంగారు తాపడం లేదని, కానీ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం జరుగుతుందని వెల్లడించారు. విజయదశమి రోజు బంగారు తాపడం పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే రాగి రేకులను తయారు చేసి, విమాన గోపురానికి బిగించి, వాటి సైజులను చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అందజేశామన్నారు. మొదటి విడతగా 12 కిలోల బంగారాన్ని స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అప్పగించినట్లు పేర్కొన్నారు. నవంబర్ 1వ తేదీన రెండవ విడత బంగారాన్ని అందజేశామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ వరకు పనులు పూర్తి చేసి, 15 నుంచి 20వ తేదీ వరకు బంగారు తాపడం చేసిన రేకులను అమర్చుతామన్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలను, దేవస్థానం నిధుల నుంచి బంగారు తాపడానికి వాడుతున్నట్లు తెలిపారు. భక్తులంతా ఆన్‌లైన్ ద్వారా, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా, నేరుగా బంగారు తాపడం కోసం విరాళాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో రెండు నెలల కాలపరిమితి కలిగిన స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, పైథాన్ కోర్సుకు ఏదేని డిగ్రీ, బేసిక్ కంప్యూటర్స్ (డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమోబైల్ టూ వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు నెలకు రూ.3900 ఫీజుతో భోజనంతో కూడిన హాస్టల్‌వసతి కల్పించబడుతుందని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడ కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 28న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


నూతనకల్: పట్టుకున్న నిందితుడిని చూపుతున్న పోలీసులు

నూతనకల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు. బుధవారం నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్న 60బస్తాల్లోని 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహన డ్రైవర్‌ను విచారించగా.. గతంలో సివిల్ సప్లయ్ అధికారులు సీజ్ చేసిన బియ్యాన్ని వేలంలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో పోలీసులు సివిల్ సప్లయ్ అధికారులను వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా బియ్యం తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో రేషన్ బియ్యం తరలిస్తున్న పొన్నం మురళి, బాణోతు వెంకటేశ్వర్లు, కాసం రమేష్, గుడా వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మహేంద్రనాథ్, ఎస్‌బీ కానిస్టేబుల్ తండు రవికుమార్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో 7 క్వింటాళ్లు..

నేరేడుచర్ల: ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన పాలకీర్తి రమణ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి 7 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ మేరకు రమణపై కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కట్నం కోసం వేధించిన కేసులో నలుగురికి జైలుశిక్ష

మిర్యాలగూడ టౌన్: అదనపు కట్నం కోసం వేధించిన కేసులో నలుగురికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం మిర్యాలగూడ 1వ అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బీఎస్ఎస్ సుమ బాల తీర్పు వెలువరించారు. సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుండబోయినగూడెం గ్రామానికి చెందిన అమరారపు శోభన్‌బాబుకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన అమరారపు శారదతో వివాహం అయ్యింది. వివాహమైన కొద్దిరోజుల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని శోభన్‌బాబు శారదను వేధింపులకు గురిచేయడంతో ఆమె 2018లో మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ సదానాగరాజు కేసు నమోదు చేయగా ఎస్ఐ రాములు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు శోభన్‌బాబుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించగా, ఇదే కేసులో అమరారపు మాణిక్యమ్మ, అమరారపు మురళి, కాటేపల్లి కోటేశ్వర్‌రావుకు ఆరు నెలలు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరిని రూ.2వేల జరిమాన విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరిచంఆరు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. సుధాకర్ వాదించగా కోర్టు పీసీ పెద్దిరాజు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

దుండగుల చేతిలో వ్యక్తి దారుణ హత్య

- ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు..?


కొండయ్య మృతదేహం

వేములపల్లి (మాడ్గులపల్లి): దుండగుల చేతిలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం నారాయణపురంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య(64) ఇంట్లో ఉండగా బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి కత్తులతో దాడి చేశారు. కొండయ్య కేకలు వేయడంతో స్థానికులు రావడంతో దుండగులు పరారయ్యారు. కొండయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వీరబాబు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. దుండగులు కొండయ్యను హత్య చేసి ఆటోలో వెళ్తుండగా గ్రామస్తులు వెంబడించి ధర్మాపురం గ్రామం వద్ద ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. మృతుడి భార్య రెండేండ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా ముగ్గురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోత్కూరు వాసి దుర్మరణం


వెంకన్న (ఫైల్)

పెడన, మోత్కూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన డీసీఎం కో డ్రైవర్ వారాల వెంకన్న (50) మృతిచెందాడు. ద్విచక్ర వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్ట్స్‌తో జంషెడ్‌పూర్ నుంచి చెన్నయ్‌కు డీసీఎం బయలుదేరింది. ఉదయం ఐదు గంటల సమయంలో పెడన-మచిలీపట్నం బైపాస్ రోడ్డులో మచిలీపట్నం వైపు డీసీఎం ప్రయాణిస్తుండగా డ్రైవర్ నిమ్మగడ్డ రామచంద్రయ్య ఎదురుగా లారీని ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఆ లారీ ముందుగా మరో వాహనం వెళ్తుండటంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో డీసీఎం అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రయ్యకు కో డ్రైవర్‌గా ఉన్న వారాల వెంకన్న తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రామచంద్రయ్య స్వల్పగాయాలతో బయటపడ్డాడు. వెంకన్న కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంకన్న కుమారుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారాల అంజయ్య, కమలమ్మ దంపతుల పెద్ద కుమారుడు వెంకన్న. పది సంవత్సరాల క్రితం చిన్న కుమారుడు లక్ష్మణ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు వెంకన్న మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కుమారుడి ఆచూకీ తెలపాలని తల్లిదండ్రుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఎల్లయ్య తల్లిదండ్రులు

చివ్వెంల(సూర్యాపేట): కనపించకుండా పోయిన తమ కుమారుడి ఆచూకీ తెలపాలంటూ తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన చివ్వెంల మండలం ఉండ్రుగొండ గ్రామంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండ్రుగొండ గ్రామానికి చెందిన అంబటి ఎల్లయ్య, అతడి భార్య సైదమ్మ కలిసి ఈ నెల 6వ తేదీన సూర్యాపేటలోని ఓ బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకురావడానికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం సైదమ్మ మాత్రమే ఇంటికి తిరిగి వెళ్లింది. దీంతో ఎల్లయ్య తల్లిదండ్రులు అంజయ్య, సుగుణమ్మ తమ కుమారుడు ఎక్కడ అని సైదమ్మను అడగగా పని ఉందని వెళ్లాడని పేర్కొంది. ఎల్లయ్య మరుసటిరోజు కూడా ఇంటికి రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు కోడలిని నిలదీయగా ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అత్తమామలు ఫోన్ చేస్తే గ్రామాల్లో వెతుకుతున్నానని చెప్పింది. తమ కుమారుడు అదృశ్యమయ్యాడని ఈ నెల 10వ తేదీన ఎల్లయ్య తల్లి సుగుణమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బుధవారం గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఆందోళన చేపట్టారు. తమ కుమారుడు అదృశ్యంపై తమ కోడలితో పాటు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉందని ఎల్లయ్య తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ బి. వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా.. సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే ఎల్లయ్య ఆచూకీ కనిపెడతామని పేర్కొన్నారు.

కొత్త ఉపాధ్యాయుల తొలి పలుకు

డీఎస్సీ–2024లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఎన్నో ఏళ్ల కష్టానికి ఫలితం దక్కిందని, తమ కల నెరవేరిందని సాక్షితో కొందరు తమ అనుభవాలను పంచుకున్నారు.

తొలిరోజు కొత్త అనుభూతి



కొండమల్లేపల్లి: టీచర్‌గా తొలి రోజు స్కూల్‌కు రావడం కొత్త అనుభూతినిచ్చింది. నా కష్టానికి ఫలితంగా తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. నా విధులను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతా.

– టి. పరమేష్, చెర్వన్నారం, కట్టంగూర్ మండలం

అంకితభావంతో విద్యాబోధన చేస్తా



నల్లగొండ రూరల్: అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని నిర్ణయించుకున్నాను. అయిదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎంతో సన్నద్ధమయ్యాను. కతాల్‌గూడెం మండల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధుల్లో చేరాను.

– గంజి వినీత, ఎస్‌జీటీ, కతాల్‌గూడెం ప్రాథమిక పాఠశాల, నల్లగొండ

చదివిన పాఠశాలకే టీచర్‌గా వచ్చా


ప్రిన్సిపాల్‌తో గంగాభవాని (ఎడమ వైపు)

గుండాల: నేను పదో తరగతి వరకు చదివిన గుండాల జెడ్పీహెచ్ఎస్‌కే సోషల్ సబ్జెక్ట్ టీచర్‌గా రావడం చాలా ఆనందంగా ఉంది. నాకు విద్య నేర్పిన గురువులు, గ్రామస్తులు, తోటి మిత్రులు నన్ను అభినందించడం గొప్ప అనుభూతినిచ్చింది. సొంత గ్రామంలో టీచర్ ఉద్యోగం చేయడం మరువలేని సంఘటనగా భావిస్తున్నా.

– మోకాళ్ల గంగాభవాని, గుండాల

విద్యా బోధన చేయడం నా అదృష్టం



భూదాన్‌పోచంపల్లి: డీఎస్సీ–2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యా. పోచంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగంలో చేరాను. సొంత మండలంలోనే ఉద్యోగం వచ్చినందుకు ఆనందంగా ఉంది. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇదే మండలంలో గత 12 ఏళ్లుగా సీఆర్పీగా పనిచేశాను.

– కోట్ల కృష్ణ, జూలూరు, భూదాన్‌పోచంపల్లి మండలం

జీవితంలో మర్చిపోలేని రోజు


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కూరెళ్ల సింధు

చిట్యాల: గృహిణిగా ఉంటూనే డీఎస్సీకి ప్రిపేరై ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. బుధవారం చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరటం నా జీవితంలో మరిచిపోలేని రోజు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనను అందిస్తాను.

– కూరెళ్ల సింధు, తంగేడుపల్లి, చౌటుప్పల్ మండలం

ఎంతో గర్వంగా ఉంది


డిండి జెడ్పీహెచ్ఎస్‌లో పాఠాలు బోధిస్తున్న రహమతుల్లా

డిండి: నేను పుట్టి పెరిగిన ఊరిలో నాకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించటం ఎంతో గర్వంగా ఉంది. డిండి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాను. అదే పాఠశాలలో ఎస్‌జీటీగా ఉపాధ్యాయుడిగా చేరాను. ఆటో నడుపుతూ నన్ను చదివించిన నా తల్లిదండ్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా.

– మహమ్మద్ ఖాజా రహమతుల్లా, డిండి

ఇంగ్లిష్‌పై భయం పోగొడతా



మోత్కూరు: స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా మోత్కూరు జెడ్పీహెచ్ఎస్‌లో జాయిన్ అయ్యాను. గతంలో సుమారు 20 సంవత్సరాలుగా ప్రైవేట్‌గా టీచర్‌గా పనిచేశా. ఇంగ్లిష్ భాష మాకు రాదేమో అనే అపోహను విద్యార్థుల మనస్సుల్లోంచి పోగొడతా. నా అనుభవంతో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తా. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దుతా. ఇదే పాఠశాలలో 8, 9 తరగతులు 1990–1992 విద్యాసంవత్సరంలో చదువుకున్నాను. మా కుటుంబమంతా ఇదే పాఠశాలలో చదివారు.

– మేకల శశికుమార్, ఎస్ఏ, ఇంగ్లిష్, జెడ్పీహెచ్ఎస్, మోత్కూరు

విద్యార్థుల్లో చురుకుదనం బాగుంది


ఈదులూరు ప్రాథమిక పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న రమాదేవి

కట్టంగూర్: నేను ఇంటర్ చదివే రోజుల్లో ప్రభుత్వ టీచర్ కావాలన్న కోరిక నేటితో సాకారమైంది. కట్టంగూర్ మండలం ఈదులూరు ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరా. మొదటి రోజు విద్యార్థుల విద్యార్థుల చురుకుదనం చూసి సంతోషం వేసింది.

– గుండగోని రమాదేవి, అక్కలాయిగూడెం, కట్టంగూర్ మండలం

చదువుకున్న పాఠశాలలోనే పాఠాలు చెబుతున్నా


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న దేవిశెట్టి అరుణ

హుజూర్‌నగర్: చదువుకున్న పాఠశాలలోనే టీచర్‌గా విద్యార్థులకు పాఠాలు చెప్పడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. హుజూర్‌నగర్‌లోని ఎన్ఎస్‌పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బాధ్యత చేపట్టాను. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటమే నా లక్ష్యం.

– దేవిశెట్టి అరుణ, హుజూర్‌నగర్

ఉత్సాహంగా పాఠాలు బోధించా


హెచ్ఎంతో అజీజ్

రామన్నపేట: రామన్నపేట బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా విధుల్లో చేరా. విద్యార్థులతో పరిచయ కార్యక్రమం అనంతరం ఉత్సాహంగా పాఠాలు బోధించాను. నా జీవితంలో ఈ రోజు ఎంతో మధురమైన రోజు.

– అజీజ్ హుస్సేన్, బాలికల ఉన్నత పాఠశాల, రామన్నపేట